క్లుప్తంగా

ముగిసిన కొర్రాజుల స్వామి జాతర



స్వామిని నిప్పుల గుండాన్ని దాటిస్తూ..

అశ్వారావుపేటరూరల్: మండల పరిధిలోని వేదాంతపురం గ్రామంలో నిర్వహిస్తున్న చిన్న కొర్రాజుల స్వామి వారి జాతర ఉత్సవాలు ముగిశాయి. కాగా, శుక్రవారం ఉదయం స్వామి వారిను ప్రత్యేకంగా అలంకరించి గ్రామంలోని పురవీధుల్లో ఘనంగా ఊరేగింపు కార్యక్రమాన్ని నిర్వహించగా.. భక్తులు స్వామి వారిను దర్శించుకున్నారు. అనంతరం ఆలయం వద్ద ప్రత్యేకంగా సరువులతో సిద్ధం చేసిన నిప్పుల గుండాన్ని స్వామి వారిని దాటించగా, ఆ తర్వాత భక్తులు కుడా నిప్పుల గుండాన్ని దాటి మొక్కులు చెల్లించుకున్నారు.

కల్యాణలక్ష్మి చెక్కుల పంపిణీ



కల్యాణలక్ష్మి, షాదీ ముబారక్ చెక్కులు అందజేస్తున్న ఎమ్మెల్యే పాయం

పినపాక: మండల పరిధిలోని పినపాక రైతు వేదికలో కల్యాణ లక్ష్మి, షాదీ ముబారక్ చెక్కులను శుక్రవారం ఎమ్మెల్యే పాయం వెంకటేశ్వర్లు చేతుల మీదుగా అందజేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. కాంగ్రెస్ తోనే పేదలకు న్యాయం జరుగుతుందని, ఎటువంటి అవినీతి లేకుండా ప్రజలకు సంక్షేమ పథకాలు అందుతున్నాయని అన్నారు. తహసీల్దార్ గోపాలకృష్ణ, ఎంపీడీఓ సునీల్ కుమార్, ఎంపీఓ వెంకటేశ్వరరావు, ఎంఈఓ నాగయ్య తదితరులు పాల్గొన్నారు.

బీఆర్ఎస్ ధర్నా

చర్ల: చర్ల మండలంలో అపరిష్కృతంగా ఉన్న సమస్యల పరిష్కారం కోసం బీఆర్ఎస్ ఆధ్వర్యంలో శుక్రవారం చర్లలో ధర్నా నిర్వహించారు. మండల కేంద్రంలోని బస్టాండ్ సెంటర్‌లోని ప్రధాన రహదారిపై బైఠాయించిన నాయకులు, కార్యకర్తలు.. బస్టాండ్ సెంటర్ నుంచి జూనియర్ కళాశాల వైపునకు వెళ్లే రహదారికి మరమతు చేయాలని, చర్లలో ప్రభుత్వ ఐటీఐ, డిగ్రీ కళాశాలలను ఏర్పాటు చేయాలని డిమాండ్ చేశారు. వద్దిపేట చెక్‌డ్యాం నిర్మాణం చేయాలన్నారు. పార్టీ మండల కన్వీనర్ దొడ్డి తాతారావు, కో కన్వీనర్ ఐనవోల్ పవన్‌కుమార్ మాట్లాడారు. పార్టీ మాజీ మండల అధ్యక్షులు సోయం రాజారావు, మాజీ ఎంపీపీ గీదా కోదండరామయ్య, నాయకులు ఎస్డీ అజీజ్, సూర్యనారాయణరాజు, ఎడ్ల రామదాసు, దిన సరపు భాస్కర్‌రెడ్డి, పంజా రాజు, కాకి అనీల్, మహిళా విభాగం అధ్యక్షురాలు చింతల త్రివేణి నాయకులు కార్యకర్తలు పాల్గొన్నారు.

ప్రశంసా పత్రాలు అందజేత

అశ్వారావుపేటరూరల్: పదో తరగతి వార్షిక పరీక్షల్లో ఉత్తమ ప్రతిభ కనబరిచిన ఇద్దరు విద్యార్థులకు ప్రైవేటు సంస్థ ట్రెండ్స్ ఆధ్వర్యంలో శుక్రవారం ప్రశంసాపత్రాలను అందించారు. స్థానిక ఆ సంస్థ షాపింగ్ మాల్‌లో ఓ ప్రైవేటు పాఠశాలకు చెందిన విద్యార్థులు టీ.సోమనాథ్, సిద్ధాంతపు సాత్విక్ సాయికుమార్ స్కూల్ టాపర్లుగా నిలిచారు. దీంతో ఆ సంస్థ మేనేజర్ రాజు ఆధ్వర్యంలో టాపర్లుగా నిలిచిన విద్యార్థులకు మెడల్స్, ప్రశంసా పత్రాలతోపాటు ట్రెండ్స్ గిఫ్ట్ కార్డులు, కూపన్లు అందించారు.

ప్రశాంతంగా గ్రామసభలు

అశ్వారావుపేటరూరల్: సీతారామ ఎత్తిపోతల ప్రాజెక్టు కాలువ నిర్మాణాలకు సంబంధించి భూసేకరణ కోసం శుక్రవారం పలు గ్రామ పంచాయతీల్లో గ్రామసభలు నిర్వహించారు. మండల పరిధిలోని ఆసుపాక, గుమ్మడవల్లి, బచ్చువారిగూడెం, తిరుమలకుంట పంచాయతీ కార్యాలయాల్లో నిర్వహించిన గ్రామసభల్లో స్థానిక డిప్యూటీ తహసీల్దార్ రామకృష్ణ హాజరు కాగా.. ఆయా జీపీల్లో కాలువ నిర్మాణాల్లో భూములు కోల్పోతున్న సర్వే నంబర్లను వివరించారు. ఈ సందర్భంగా డీటీ మాట్లాడుతూ.. త్వరలోనే క్షేత్రస్థాయిలో సర్వే జరుగుతుందని, సర్వే సమయంలో రైతులంతా అందుబాటులో ఉండాలని కోరారు. ఇరిగేషన్ ఏఈఈ, ఆర్ఐలు కృష్ణ, పద్మావతి, కార్యదర్శులు రామకృష్ణ, బాబు, కార్తీక్, పీసా కమిటీ సభ్యులు, రైతులు పాల్గొన్నారు.

రిజిస్ట్రేషన్ చేయించుకోవాలి

మణుగూరురూరల్: రైతులందరూ ఫార్మర్ రిజిస్ట్రేషన్ చేయించుకోవాలని ఏఈఓ కొమరం లక్ష్మణ్‌రావు సూచించారు. శుక్రవారం గుట్టమల్లారం గ్రామంలోని రైతువేదికలో రైతుల ఫార్మర్ రిజిస్ట్రేషన్ కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా ఏఈఓ లక్ష్మణ్‌రావు మాట్లాడుతూ.. ఆధార్ కార్డ్, పట్టాదారు పాస్‌బుక్, ఫోన్ నంబర్లతో మీ సేవ కేంద్రాల్లో కానీ, గుట్టమల్లారం రైతువేదికలో కానీ ఫార్మర్ రిజిస్ట్రేషన్ చేయించుకోవాలన్నారు. ఏఈఓ హారిక, రైతులు పాల్గొన్నారు.

ఫస్ట్ ఎయిడ్ బాక్సులు

అలంకారప్రాయం

- ఆర్టీసీ బస్సుల్లో నిర్వహణ లోపం
- కొన్ని బస్సుల్లో అరకొర మందులు.. మరికొన్నింటిలో ఖాళీ బాక్సులు
- అమలుకాని మోటారు వాహన చట్టం



బస్సులో ఖాళీగా దర్శనమిస్తున్న ఫస్ట్ ఎయిడ్ బాక్స్



ఫస్ట్ ఎయిడ్ బాక్సు ఏర్పాటు చేయని బస్సు..

భద్రాచలంఅర్బన్: ఆర్టీసీ బస్సుల్లో ప్రయాణం సురక్షితం.. ప్రయాణికుల క్షేమమే నినాదంగా చెప్పుకునే ఆర్టీసీ యాజమాన్యం ఫస్ట్ ఎయిడ్ బాక్సుల నిర్వహణపై మాత్రం శ్రద్ధ వహించడం లేదు. బస్సు రోడ్డు ప్రమాదానికి గురైతే అప్పటికప్పుడు ప్రాయణికులు తాత్కాలిక వైద్య సేవలు పొందేందుకు ప్రతి ఆర్టీసీ బస్సుల్లో ఫస్ట్ ఎయిడ్ బాక్సు ఉండాలి. కానీ ప్రస్తుతం భద్రాచలంతోపాటు పలు ప్రాంతాల్లో ఆర్టీసీ బస్సుల్లో ఫస్ట్ ఎయిడ్ బాక్సుల్లో ఎటువంటి ఔషధాలూ లేకుండా అలంకార ప్రాయంగా దర్శనమిస్తున్నాయి. ఒకవేళ ఉన్నా అవి అరకొరగానే ఉన్నాయి.

అమలు కాని చట్టం..

కేంద్ర మోటారు వాహన చట్టం 1930 ప్రకారం ప్రయాణికుల వాహనాల్లో విధిగా ప్రథమ చికిత్స బాక్సులు ఏర్పాటు చేయాలి. ఈ చట్టాన్ని మరింత పటిష్టం చేస్తూ 1988లో మరిన్ని సవరణలు చేశారు. నిబంధనల ప్రకారం ప్రథమ చికిత్సకు అవసరమైన మందులు, ఇతర వస్తువులను ప్రథమ చికిత్స బాక్సుల్లో ఉంచాలి. లైసెన్స్ పొందే ముందు బస్సు డ్రైవర్, కండక్టర్ తప్పనిసరిగా వారం రోజుల పాటు ప్రథమ చికిత్స చేయడంపై శిక్షణ పొందాలి. ప్రతి మూడేళ్లకోసారి లైసెన్సును పునరుద్ధరించుకోవాలని కూడా చట్టం నిర్దేశిస్తుంది. కాగా, రవాణా శాఖ అధికారుల నుంచి బస్సులకు ఫిట్నెస్ సర్టిఫికెట్ పొందే సమయంలో మాత్రమే మొక్కుబడిగా ప్రథమ చికిత్స కిట్లను చూపుతున్నారు. ఆ తర్వాత వాటి నిర్వహణను గాలి కొదిలేస్తున్నారు. బస్సులు నడిపేటపుడు అకస్మాత్తుగా బ్రేక్ వేస్తే ఒక్కోసారి కొందరు ప్రయాణికులు గాయపడుతున్న సందర్భాలు ఉంటున్నాయి. ప్రథమ చికిత్స కిట్టు ఉంటే కొంతమేర ఉపశమనం ఉంటుంది.

పట్టించుకోని అధికారులు

ఫస్ట్ ఎయిర్ బాక్సుల్లో మందులు ఏర్పాటు చేయకపోతే బస్సులను సీజ్ చేసే అధికారం ఆర్టీఓ స్థాయి అధికారులకు ఉంటుంది. అయినప్పటికీ ప్రభుత్వ రంగ సంస్థ అయిన ఆర్టీసీ నిర్వహణలో ఉన్న వాటిని ప్రభుత్వ బస్సులేనన్న భావనతో రవాణా అధికారులు కన్నెత్తి చూడడం లేదనే విమర్శలున్నాయి. అనుమతుల కోసం రవాణా శాఖ కార్యాలయానికి వెళ్లినపుడు మాత్రమే అలంకార ప్రాయంగా వీటిని ఏర్పాటు చేస్తుంటారు. ఆ తర్వాత మళ్లీ కనిపించడం లేదు.

ఆ బాక్సుల్లో ఏముంటాయ్..

మోటార్ వాహన చట్టం ప్రకారం.. ప్రథమ చికిత్స బాక్సులో 17 రకాల వరకు వస్తువులు ఉండాలి. ఎలాస్టిక్ బ్యాండేజ్ రోలర్స్ ఐదు, బెటాడిన్ ఆయింట్మెంట్, డెటాల్ లేదా బయోడిన్, స్టెరిలైజ్డ్ కాటన్ బండిల్స్, నియోసిన్ పౌడర్ డబ్బా, సర్జికల్ బ్లేడ్, బర్నాల్ ఆయింట్మెంట్, వాటర్ ప్రూఫ్ ప్లాస్టర్, బ్యాండ్ ఎయిడ్ ప్లాస్టర్లు, నైట్రోజన్, హైడ్రోజన్ పెరాక్సైడ్, దూది, స్పిరిట్, పెయిన్ కిల్లర్ మాత్రలు, కడుపు నొప్పి, జ్వరం, విరేచనాలకు మాత్రలు ఉండాలి.

బాక్సులు కచ్చితంగా ఉండాలి



బస్సుల్లో ఫస్ట్ ఎయిడ్ బాక్సులు దిష్టి బొమ్మల్లా ఉంటున్నాయి. కనీసం ప్రాథమిక వైద్యానికి సంబంధించిన ఎటువంటి మందులూ ఉండడం లేదు. అత్యవసర సమయంలో ప్రయాణికులకు అవసరమైన మందులను ఫస్ట్ ఎయిడ్ బాక్సుల్లో ఉంచేలా ఆర్టీసీ అధికారులు చర్యలు తీసుకోవాలి.

– ఆకోజు సునీల్, బీఆర్ఎస్ పార్టీ, భద్రాచలం

చర్యలు తీసుకుంటాం..



ఆర్టీసీ బస్సుల్లో ప్రథమ చికిత్స బాక్సుల్లో అందుబాటులో ఉండేలా పరిశీలించి చర్యలు తీసుకుంటాం. సదరు బాక్సులో అవసరమైన మందులు ఉండేలా డ్రైవర్లు, కండక్టర్లకు సూచిస్తాం. వాటికి తాళాలు వేసి అత్యవసర సమయాల్లో తెరిచి ప్రథమ చికిత్స చేయాలి. ప్రతినెలా బాక్సులను తనిఖీ చేసుకోవాలి.

– వెంకటపుల్లయ్య, ఎంవీఐ, భద్రాచలం

దొంగతనాల కారణంగా..



బస్సుల్లో ఫస్ట్ ఎయిడ్ బాక్సులు ఏర్పాటుపై దృష్టి సారిస్తున్నాం. ఇప్పటికే ఉన్నతాధికారులకు నివేదిక ఇచ్చాం. కిట్లను దొంగతనం చేస్తున్నట్లుగా మా దృష్టికి వచ్చింది. దీని కారణంగానే బస్సులో ప్రథమ చికిత్స కిట్లు అందుబాటులో ఉండటం లేదు. త్వరలోనే కిట్లను ఏర్పాటు చేస్తాం.

– తిరుపతి, ఆర్టీసీ డీఎం, భద్రాచలం

పొలాల్లో నీటిగుంతలు ఉండాలి



దమ్మపేట: ముష్టిబండలో కరపత్రాలు ప్రదర్శిస్తున్న వ్యవసాయ శాస్త్రవేత్తలు, రైతులు

అశ్వారావుపేటరూరల్: ప్రతి పంట పొలంలో నీటి గుంతలను ఉండేలా చూసుకోవాలని స్థానిక వ్యవసాయ కళాశాల శాస్త్రవేత్తలు సూచించారు. మండల పరిధిలోని అల్లిగూడెం గ్రామంలో శుక్రవారం రైతు ముంగిట్లో శాస్త్రవేత్తల కార్యక్రమాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ.. సెల్ ఫోన్లకు చార్జింగ్‌లా భూగర్భ జలాలకు నీటిగుంతలు అవసరమని అన్నారు. అలాగే పంట పొలాలకు వాడే రసాయనాలు, ఎరువుల వివరాలను తప్పనిసరిగా నమోదు చేసుకుని, ఆయా రసీదులను భద్రపరుచుకుంటే భవిష్యత్‌లో ఇబ్బంది వస్తే నష్ట పరిహారాన్ని పొందే అవకాశం ఉంటుందని వివరించారు. అదే విధంగా వ్యవసాయ కళాశాలను రైతులు సందర్శించి పంటలు, సాంకేతికతను గమనించాలని సూచించారు. ఈ కార్యక్రమంలో శాస్త్రవేత్తలు డాక్టర్ పావని, డాక్టర్ కృష్ణతేజ, ఏవో శివరాంప్రసాద్, ఏఈవోలు ఆరేపల్లి సతీష్, కార్యదర్శి స్వతంత్ర తేజ, రైతులు పాల్గొన్నారు.

అధిక దిగుబడిపై అవగాహన

దమ్మపేట: వ్యవసాయ, ఉద్యాన పంటల్లో అధిక దిగుబడి సాధించడానికి సాగులో పాటించాల్సిన ఆధునిక యాజమాన్య పద్ధతులు, మెళకువల గురించి అశ్వారావుపేట వ్యవసాయ కళాశాల శాస్త్రవేత్త నాగ అంజలి, రైతులకు అవగాహన కల్పించారు. శుక్రవారం మండలంలోని ముష్టిబండ గ్రామంలో 'రైతు ముంగిట్లో శాస్త్రవేత్తలు' కార్యక్రమాన్ని నిర్వహించగా.. శాస్త్రవేత్త నాగ అంజలి మాట్లాడారు. నేల తల్లి ఆరోగ్యాన్ని కాపాడుకోవాల్సిన ఆవశ్యకతను వివరించారు. భూసార పరీక్షలో మట్టిని సేకరించే విధానం పట్ల సమగ్రంగా అవగాహన కల్పించారు. రసాయన ఎరువుల వినియోగం తగ్గించి, సేంద్రీయ ఎరువులను వినియోగించాలని సూచించారు. కార్యక్రమంలో శాస్త్రవేత్త శ్రీలత, వ్యవసాయ విస్తరణ అధికారులు, రైతులు తదితరులు పాల్గొన్నారు.

జీలుగు విత్తనాలు పంపిణీ



జీలుగు విత్తనాలు అందజేస్తున్న స్టాఫ్ అసిస్టెంట్ కాంతారావు

సాక్షి ఎఫెక్ట్..

కరకగూడెం: మండల కేంద్రంలోని పినపాక పీఏసీఎస్ సేల్ పాయింట్ వద్ద రైతులకు స్టాఫ్ అసిస్టెంట్ చందా కాంతారావు సబ్సిడీపై జీలుగు విత్తనాలు పంపిణీ చేశారు. వరి కోతలు పూర్తయి నెల రోజులు గడుస్తున్నా మండలంలో జీలుగు విత్తనాలు అందకపోవడంపై శుక్రవారం 'పచ్చిరొట్ట విత్తనాలు ఆలస్యం' అనే శీర్షికన 'సాక్షి'లో కథనం ప్రచురితమైన విషయం తెలిసిందే. స్పందించిన అధికారులు జీలుగుల పంపిణీకి చర్యలు చేపట్టారు. 30 కేజీల విత్తనాల బస్తా ధర రూ.2,137గా ప్రభుత్వం నిర్ణయించిందని, ఆసక్తి గల రైతులు తమ ఆధార్ కార్డ్, పట్టాదారు పాసుపుస్తకం జిరాక్స్ కాపీలను వెంట తీసుకుని రావాలని స్టాఫ్ అసిస్టెంట్ సూచించారు. కాగా, పచ్చిరొట్ట విత్తనాల ధరలు పెరగడంతో రైతులు పెదవి విరుస్తున్నారు.

తిరంగా ర్యాలీ

దమ్మపేట: దమ్మపేట ప్రధాన సెంటర్‌లో త్రివిధ దళాలకు మద్దతుగా బీజేపీ ఆధ్వర్యంలో తిరంగా ర్యాలీని నిర్వహించగా.. ముఖ్య అతిథిగా పార్టీ జిల్లా అధ్యక్షుడు ప్రభాకర్ రెడ్డి హాజరయ్యారు. కార్యక్రమంలో బీజేపీ నాయకులు విశ్వేశ్వరరావు, పుల్లారావు తదితరులు పాల్గొన్నారు.

ఐఎన్‌టీయూసీ స్ట్రక్చరల్ సమావేశం



సమావేశంలో మాట్లాడుతున్న జీఎం దుర్గం రాంచందర్

మణుగూరుటౌన్: ఏరియా జీఎం కార్యాలయ సమావేశ మందిరంలో జరిగిన ఐఎన్‌టీయూసీ స్ట్రక్చరల్ సమావేశంలో శుక్రవారం కార్మికుల సమస్యలపై నాయకులు ప్రస్తావించారు. ఈ సందర్భంగా యూనియన్ వైస్ ప్రెసిడెంట్ కృష్ణంరాజు మాట్లాడుతూ.. కార్మికుల సంక్షేమంలో భాగంగా కమ్యూనిటీ హాల్ టెంట్ హౌస్ మెటీరియల్, డెకరేషన్, లైటింగ్‌లను మినహాయింపు ధరలను ఉద్యోగులకు అందుబాటులో ఉంచి వెల్ఫేర్ కమిటీ ఏర్పాటు చేయాలన్నారు. బీఆర్ అంబేడ్కర్ పార్క్ చుట్టూ ప్రహరీ గోడ నిర్మించాలని, సంత వద్ద ఫ్లాట్ పార్క్ మీద ఓపెన్ షెడ్‌లు ఏర్పాటు చేయాలని కోరారు. ప్రస్తుతం అమలులో ఉన్న ఇన్సెంటీవ్ చెల్లింపు నియమ నిబంధనలు మార్చడం, మెయిన్ చెక్‌పోస్ట్ వద్ద ఏసీ సౌకర్యం వంటి ప్రధాన సమస్యలు సమావేశంలో చర్చించారు. అనంతరం ఏరియా జీఎం దుర్గం రాంచందర్ మాట్లాడుతూ.. రాబోవు రోజుల్లో వర్షాకాలం వస్తున్న నేపథ్యంలో 45వేల టన్నుల రోజు వారీ ఉత్పత్తికి, 60వేల క్యూబిక్ మీటర్ల మట్టి వెలికితీతకు కృషి చేయాలన్నారు. సమస్యలను పరిష్కరించేందుకు ఆయా విభాగాల అధికారులను ఆదేశించారు. ఏరియా అధికారులు ఐఎన్‌టీయూసీ యూనియన్ వైస్ ప్రెసిడెంట్ కృష్ణంరాజు, షాబుద్దీన్, అబ్దుల్ రవూఫ్ ఉన్నారు.

వాహన షెడ్ల ప్రారంభం

పీవీకాలనీలోని కార్మిక కుటుంబాలు నివసించే ఎంసీ క్వార్టర్స్‌లో రూ.1.27కోట్ల వ్యయంతో 35 బ్లాకుల్లో నిర్మించిన వాహనాల షెడ్‌లను జీఎం రాంచందర్ శుక్రవారం ప్రారంభించారు. కార్యక్రమంలో అధికారులు శ్యామ్‌సుందర్, వెంకటేశ్వర్లు, ఆర్.శ్రీనివాస్, వెంకట్రావ్, రమేష్, వెంకట రామారావు, దయాకర్, మధుసూదన్‌రావు, శోభన్‌బాబు, శ్రీనివాసరావు, ప్రవీణ్, ఏఐటీయూసీ నాయకులు రామనర్సయ్య, ఐఎన్‌టీయూసీ నాయకులు కృష్ణంరాజులు పాల్గొన్నారు.

మృతదేహం మెడికల్ కాలేజీకి అప్పగింత

అశ్వాపురం: అనారోగ్యంతో మృతి చెందిన మండల పరిధిలోని సీతారాంపురం గ్రామానికి చెందిన బలుగూరు రామిరెడ్డి(65) మృతదేహాన్ని శుక్రవారం కొత్తగూడెం మెడికల్ కాలేజీకి అందజేశారు. రామిరెడ్డి కుమారుడు బలుగూరి మధు సీఐటీయూ రాష్ట్ర కార్యదర్శి. చనిపోయిన తరువాత తన తండ్రి మృతదేహం మెడికల్ కాలేజీ విద్యార్థుల పరిశోధనల నిమిత్తం ఉపయోగపడాలని మృతదేహాన్ని అందజేశామని మధు తెలిపారు.

తహసీల్దార్‌ను కలిసిన రేషన్ డీలర్లు

అశ్వాపురం: మండల నూతనంగా బాధ్యతలు చేపట్టిన తహసీల్దార్ రాజారావును శుక్రవారం రేషన్ డీలర్లు మర్యాద పూర్వకంగా కలిశారు. రేషన్ డీలర్ల సంఘం జిల్లా అధ్యక్షుడు కొడాలి వెంకటేశ్వరరావు ఆధ్వర్యంలో శాలువాతో తహసీల్దార్‌ను సన్మానించారు. ఈ కార్యక్రమంలో రేషన్ డీలర్లు వెంకటేశ్వర్లు, వినయ్, రజిత, కృష్ణవేణి, భవాని, సత్యవతి తదితరులు పాల్గొన్నారు.

గ్రామాల్లో ఫ్రైడే డ్రైడే

మణుగూరురూరల్: మండలంలోని అన్ని ఆరోగ్య ఉపకేంద్రాల పరిధిలో ఉన్న గ్రామాల్లో మణుగూరు ప్రాథమిక ఆరోగ్య కేంద్రం ఆధ్వర్యంలో శుక్రవారం సందర్భంగా ఫ్రైడే డ్రైడే కార్యక్రమం నిర్వహించారు. గ్రామాల్లోని ప్రతీ ఇంటినీ వైద్యసిబ్బంది సందర్శించి పరిసరాలను పరిశీలించారు. నీరు నిల్వ కంటైనర్లను తొలగించి శుభ్రం చేయించారు. వ్యాధుల బారిన పడకుండా పరిసరాలను పరిశుభ్రంగా ఉంచుకోవాలని, నీరు నిల్వ లేకుండా చేసుకోవాలని సూచించారు. కార్యక్రమంలో వైద్యసిబ్బంది రాంప్రసాద్, నాగజ్యోతి, జ్యోతి, తేజస్విని తదితరులు పాల్గొన్నారు.

పచ్చిరొట్ట విత్తనాలు ఇవ్వాలి

చంద్రుగొండ: పట్టాదారు పాసుపుస్తకాలతో సంబంధం లేకుండా రైతులందరికీ పచ్చిరొట్ట విత్తనాలు పంపిణీ చేయాలని సీపీఎం నాయకుడు పెద్దిని వేణు డిమాండ్ చేశారు. ఈ మేరకు వ్యవసాయశాఖ ఇంచార్జీ ఏఈఓ శ్రీనివాసరావు శుక్రవారం వినతిపత్రం అందించారు. ప్రభుత్వం రాయితీపై పంపిణీ చేస్తున్న జీలుగులు, పిల్లిపెసర విత్తనాలు ఇవ్వాలని డిమాండ్ చేశారు. ఈ కార్యక్రమంలో ఆ పార్టీ నాయకులు విప్పర్ల వెంకటేశ్వర్లు, రాయి రాజా, నాగుల్‌మీరా, అబ్దుల్ రహెమాన్, రాజా పాల్గొన్నారు.

ఆర్థిక సాయం అందజేత

ములకలపల్లి: రోడ్డు ప్రమాదంలో గాయపడ్డ గ్రామీణ వైద్యుడికి తోటి ఆర్ఎంపీలు ఆర్థిక సాయం అందించారు. ములకలపల్లి మండల పరిధిలోని తిమ్మంపేట గ్రామానికి చెందిన ఆర్ఎంపీ కాసులు ఇటీవల జరిగిన రోడ్డు ప్రమాదంలో గాయపడ్డాడు. దీంతో మండల ఆర్ఎంపీల సహకారంతో సమీకరించిన రూ 16 వేల నగదును శుక్రవారం బాధిత కుటుంబీకులకు అందజేశారు. ఆర్ఎంపీలు బండి కొమరయ్య, రాంబాబు, వెంకటేశ్వరరావు, సుబ్రమణ్యం, కొమ్ము నాగరాజు, విశ్వాస్, రఫీ, రాము తదితరులు పాల్గొన్నారు.

ఇసుక లారీలతో ట్రాఫిక్ జామ్



సాంబాయిగూడెం వద్ద ట్రాఫిక్‌లో నిలిచిపోయిన అంబులెన్స్

మణుగూరుటౌన్: మండలంలోని సాంబాయిగూడెం ఇసుక సొసైటీ నిర్వాహకులు ఇష్టారాజ్యంగా వ్యవహరిస్తున్నారు. లోడింగ్ కోసం వచ్చిన లారీలు రోడ్డుకు ఇరువైపులా నిలిపి ఉంచడంతో భారీగా ట్రాఫిక్ జామ్ అవుతోంది. సాంబాయిగూడెం ఇసుక సొసైటీని దక్కించుకున్న రైజింగ్ కాంట్రాక్టర్ లోడింగ్ వచ్చిన లారీలను ముందుగా నిర్ణయించుకున్న స్థలంలో ఉంచి లోడింగ్‌కి పంపాల్సి ఉంటుంది. కానీ ఇవేమీ పట్టని రైజింగ్ కాంట్రాక్టర్.. కొత్తగూడెం–ఏటూరునాగారం ప్రధాన రహదారి పైనే ఉంచాడు. ఫలితంగా శుక్రవారం నిత్యం రద్దీగా ఉండే దారిలో.. ట్రాఫిక్ అంతరాయం ఏర్పడింది. వందలాది లారీలు ఉండటంతో వాహనదారులు తీవ్ర ఇక్కట్లు పడ్డారు. గంటల తరబడి వాహనాలు నిలిచిపోవడంతో రెండు అంబులెన్స్‌లకు దారి లేని పరిస్థితి నెలకొంది. దీంతో ప్రయాణికులు తీవ్ర అసహనం వ్యక్తం చేశారు. సమాచారం తెలుసుకున్న మణుగూరు ఇన్‌చార్జ్ సీఐ వెంకటేశ్వర్లు, ఎస్ఐ మేడ ప్రసాద్‌లు వెంటనే ట్రాఫిక్‌ను క్లియర్ చేసి వాహనాలను పంపించి వేశారు.

ఇళ్ల మంజూరు పత్రాలు అందజేత



ములకలపల్లి: మాధారంలో ఇందిరమ్మ ఇళ్ల పత్రాలు అందజేస్తున్న ఎమ్మెల్యే ఆదినారాయణ

ములకలపల్లి: మండల పరిధిలోని మాధారం జీపీ కార్యాలయంలో శుక్రవారం లబ్ధిదారులకు ఇళ్ల మంజూరు పత్రాలను ఎమ్మెల్యే జారే ఆదినారాయణ అందజేశారు. స్థానిక ఏంఏఓ కార్యాలయంలో పచ్చిరొట్ట విత్తనాల పంపిణీ కార్యక్రమాన్ని ఎమ్మెల్యే ప్రారంభించారు. అనంతరం ములకలపల్లిలో నిర్వహిస్తున్న ఉపాధ్యాయ శిక్షణా కార్యక్రమంలో పాల్గొన్న ఎమ్మెల్యే.. పలు సూచనలు చేశారు. తహసీల్దార్ భూక్యా గన్యా, ఎంపీడీఓ గద్దె రేవతి, ఎంఈఓ సత్యనారాయణ, ఏఓ అరుణ్‌బాబు, పీఏసీఎస్ సీఈఓ కుంచారపు శ్రీనివాసరావు, మాజీ జెడ్పీటీసీ బత్తుల అంజి, పార్టీ మాజీ మండల అధ్యక్షుడు తాండ్ర ప్రభాకర్‌రావు, మాజీ సర్పంచ్ కారం సుధీర్, గాడి తిరుపతి రెడ్డి, మిరియాల అవినాశ్, సురభి రాజేశ్, తదితరులు పాల్గొన్నారు.

దమ్మపేట: మండలంలోని గండుగులపల్లి క్యాంపు కార్యాలయంలో ఇందిరమ్మ ఇళ్ల పట్టాలను లబ్ధిదారులకు స్థానిక ఎమ్మెల్యే జారె ఆదినారాయణ పంపిణీ చేశారు. అనంతరం మండలంలోని 15 గ్రామ పంచాయితీ కార్యాలయాల్లో లబ్ధిదారులకు ఎంపీడీఓ రవీంద్రా రెడ్డి చేతులమీదుగా పంపిణీ చేశారు. కార్యక్రమంలో ఎంపీఓ రామారావు, పంచాయితీ కార్యదర్శులు, ఇందిరమ్మ కమిటీ సభ్యులు, కాంగ్రెస్ నాయకులు తదితరులు పాల్గొన్నారు.

అన్నపురెడ్డిపల్లి (చంద్రుగొండ): అన్నపురెడ్డిపల్లి మండల పరిధిలోని పెద్దిరెడ్డిగూడెం, భీమునిగూడెం, గుంపెన, మర్రిగూడెం, అబ్బుగూడెం గ్రామాల్లో ఎమ్మెల్యే జారే ఆదినారాయణ శుక్రవారం పర్యటించారు. లబ్ధిదారులకు ఇందిరమ్మ ఇల్లు మంజూరీ పత్రాలను పంపిణీ చేశారు. అనంతరం గుంపెన సహకార పరపతి సంఘంలో రైతులకు పచ్చిరొట్ట విత్తనాల పంపిణీ కార్యక్రమాన్ని ఆయన ప్రారంభించారు. ఎమ్మెల్యే వెంట తహసీల్దార్ పుల్లారావు, ఎంపీడీఓ మహాలక్ష్మి, సొసైటీ చైర్మెన్ బోయినపల్లి సుధాకర్‌రావు, కాంగ్రెస్ నాయకులు వనమా గాంధీ, పర్సా వెంకటేశ్వరరావు, వేముల రమణ, నర్సింహారావు, శివ పాల్గొన్నారు.

అవగాహన కల్పించండి



ఉపాధ్యాయుల సమావేశంలో మాట్లాడుతున్న సీఐ ఇంద్రసేనారెడ్డి

చంద్రుగొండ: తరగతి గదుల్లోనే చట్టాలపై విద్యార్థులకు అవగాహన కల్పించాలని జూలూరుపాడు సీఐ ఇంద్రసేనారెడ్డి ఉపాధ్యాయులకు సూచించారు. మండలకేంద్రం చంద్రుగొండలోని జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో ఉపాధ్యాయులకు నిర్వహిస్తున్న వృత్యంతర శిక్షణ తరగతులను శుక్రవారం సీఐ సందర్శించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ.. పోక్సో చట్టం, సైబర్‌క్రైం, డ్రగ్స్, నార్కోటిక్స్, చెడువ్యసనాలపై తరగతి గదుల్లోనే పిల్లలకు అవగాహన ఉండాలన్నారు. ఎంఈఓ ఎం.సత్యనారాయణ, ఆర్‌పీలు కిరణ్, రవి, వీరన్న, ప్రసాద్, కృష్ణ, సీఆర్‌పీలు సేవ్యా, పరమేష్‌లు పాల్గొన్నారు.

క్రీడలపై మక్కువ పెంచుకోవాలి

భద్రాచలంటౌన్: విద్యార్థులు చిన్నతనం నుంచే క్రీడల పట్ల మక్కువ పెంచుకోవాలని భద్రాచలం పట్టణ సీఐ నాగరాజు అన్నారు. పట్టణంలోని ప్రభుత్వ జూనియర్ కళాశాల క్రీడా మైదానంలో హైదరాబాద్ క్రికెట్ అసోసియేషన్(హెచ్‌సీఏ) ఆధ్వర్యంలో నిర్వహిస్తున్న ఉచిత క్రికెట్ పోటీలను శుక్రవారం ఆయన ప్రారంభించి మాట్లాడారు. విద్యార్థులు ఉన్నత శిఖరాలు అవరోధించాలని ఆయన ఆకాంక్షించారు. కార్యక్రమంలో ఎస్ఐ ఐ.స్వప్న, కోచ్ సుబ్బు, పప్పు ప్రసాద్, పాయం రవివర్మ, చందు తదితరులు పాల్గొన్నారు.

ఫిట్‌నెస్ తప్పనిసరి

భద్రాచలంటౌన్: భద్రాచలం పట్టణంలోని పాఠశాలలు, కళాశాల ప్రారంభం నాటికి బస్సులు ఫిట్‌నెస్‌తో ఉండాలని భద్రాచలం మోటార్ వెహికల్ ఇన్స్పెక్టర్ సంఘం పుల్లయ్య అన్నారు. స్థానిక కూనవరం రోడ్డులోని మారుతి పారామెడికల్ కళాశాలలో విద్య సంస్థల యజమానులతో ఆయన శుక్రవారం బస్సుల ఫిట్‌నెస్‌పై అవగాహన సదస్సు నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ... బస్సుల డ్రైవర్లు, క్లీనర్లు రోడ్డు భద్రత నియమాలు, జాగ్రత్తలు పాటించాలని లేకపోతే వారిపై చర్యలు తీసుకుంని బస్సులను సీజ్ చేస్తామని హెచ్చరించారు. ఈ కార్యక్రమంలో డాక్టర్ ఎస్ఎల్. కాంతారావు, బ్రహ్మారెడ్డి పాల్గొన్నారు.

న్యూట్రీషన్ కిట్లు పంపిణీ



న్యూట్రీషన్ కిట్లను అందజేస్తున్న డిప్యూటీ డీఎంహెచ్ఓ చైతన్య

దుమ్ముగూడెం: క్షయ వ్యాధి బాధితులకు వైద్య ఆరోగ్యశాఖ ఆధ్వర్యంలో న్యూట్రీషన్ కిట్లను అందజేశారు. మండలంలోని నర్సాపురం ప్రభుత్వ వైద్యశాలలో ఏర్పాటు చేసిన కార్యక్రమంలో డిప్యూటీ డీఎం అండ్ హెచ్ఓ డాక్టర్ చైతన్య చేతుల మీదుగా క్షయ వ్యాధితో బాధపడుతూ వైద్య చికిత్స పొందుతున్న వారికి న్యూట్రీషన్ కిట్లను అందజేశారు. ఈ సందర్భంగా డిప్యూటీ డీఎం అండ్ హెచ్ఓ డాక్టర్ చైతన్య మాట్లాడుతూ.. క్రమంగా మందులు వాడాలని మంచి బలవర్ధకమైన ఆహారం తీసుకోవాలని సూచించారు. క్షయ బాధితులు క్రమంగా మందులు వాడితే తక్కువ సమయంలోనే అది దూరం అవుతుందని చెప్పారు. ఈ కార్యక్రమంలో నర్సాపురం ప్రాథమిక ఆరోగ్య కేంద్రం టీబీ సూపర్‌వైజర్లు వెంకటేశ్వరావు, ప్రసాద్, పీపీఎం సోమయ్య, ఆశా కార్యకర్తలు పాల్గొన్నారు.

విద్యార్థిని ప్రతిభ



విద్యార్థిని శ్రీభాగ్యకు జ్ఞాపిక అందజేస్తున్న రమేష్‌బాబు

భద్రాచలంటౌన్: భద్రాచలం పట్టణంలోని లిటిల్ ఫ్లవర్స్ విద్యార్థి శుక్రవారం ప్రకటించిన జేఈఈ మెయిన్స్ బీఆర్క్ ఫలితాల్లో ఉత్తమ ప్రతిభ కనభరించింది. ముత్యాల శ్రీభాగ్య ఆల్ ఇండియా ఓపెన్ క్యాటగిరిలో 513వ ర్యాంక్‌తో పాటు బి ప్లానింగ్‌లో 435వ ర్యాంక్ సాధించింది. ఈ సందర్భంగా లిటిల్ ఫ్లవర్స్ విద్య సంస్థల డైరెక్టర్ మాగంటి రమేష్ బాబు శ్రీభాగ్యను అభినందించి జ్ఞాపికను అందించి తండ్రి రాంబాబుని సత్కరించారు. ఈ కార్యక్రమంలో అధ్యాపకులు బషీర్ ఉపాధ్యాయులు మరియు సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

రైతులకు పరిహారం చెల్లించాలి



నరికేసిన ఆఫ్ టైప్ పామాయిల్ చెట్టును పరిశీలిస్తున్న ప్రభాకర్ రెడ్డి, బాధిత రైతులు

దమ్మపేట: ఆఫ్ టైప్ పామాయిల్ మొక్కల బాధిత రైతులకు తక్షణమే పరిహారం చెల్లించాలని, భారతీయ జనతా పార్టీ జిల్లా అధ్యక్షుడు ప్రభాకర్ రెడ్డి, రాష్ట్ర ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. శుక్రవారం మండలంలోని పట్వారిగూడెం, జగ్గారం, గండుగులపల్లి గ్రామాల్లో ఆఫ్ టైప్ పామాయిల్ మొక్కల బాధిత రైతుల వ్యవసాయ క్షేత్రాలను ప్రభాకర్ రెడ్డి పరిశీలించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. విత్తన ఎంపిక, నర్సరీలో మొక్కల పెంపకం తదితర చర్యల్లో ఆయిల్ ఫెడ్ అధికారుల పూర్తి నిర్లక్ష్యం వలననే ఆఫ్ టైప్ మొక్కలు వచ్చాయన్నారు. ఉదంతానికి బాధ్యత వహిస్తూ, రైతులకు పరిహారం చెల్లించాల్సిన బాధ్యతను ఆయిల్ ఫెడ్ తీసుకోవాలన్నారు. కార్యక్రమంలో బీజేపీ నాయకులు ఉడతనేని విశ్వేశ్వరరావు, మధుసూదన్‌రావు, రైతులు కారం శ్రీరాములు, తుంబూరు మహేశ్వర రెడ్డి, చెలికాని సూరిబాబు, కుర్సం ముత్యాలు, కొర్సా వీరాస్వామి, భీముడు, వసంతరావు తదితరులు పాల్గొన్నారు.